దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌ శిరీష

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మూసాపేట: వేసవి కాలంలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం మూసాపేటలోని చిత్తారమ్మ తల్లి ఆలయం వద్ద ఉప్పల చారిటబుల్‌ ట్రస్టు, మూసాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలాజీనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ పగడాల శిరీష బాబూరావు, మాజీ కార్పొరేటర్‌ తూము శ్రావణ్‌కుమార్‌, నాయకులు గౌసుద్దీన్‌, అంబటి శ్రీనివాస్‌, జిల్లా గోపాల్‌, పంచశీల శ్రీనివాస్‌, సంఘం సభ్యులు ఉప్పల చంద్రశేఖర్‌ గుప్తా, ఎం. శ్రీనివాస్‌, రాములు పాల్గొన్నారు.


సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత

కూకట్‌పల్లి: ఫతేనగర్‌కు చెందిన పి. కవితకు రూ. 2 లక్షల సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును కవిత కుటుంబ సభ్యుడికి గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణారావు అందజేశారు. సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాలక కమిటీ కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభించిన ఆలయ కమిటీ చైర్మన్‌ బుచ్చయ్య తదితరులు

మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ పాండురంగ నగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో నూతనంగా నిర్మించిన పాలక కమిటీ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్‌ బాకారం బుచ్చయ్య, ఆలయ కార్యనిర్వాహణ అధికారి గుమ్మడిదల సుధాకర్‌ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అనుపమ, జి. రామకృష్ణారావు, నరసింహులు, డి. జనార్దన్‌, పి.మల్లికార్జునరెడ్డి, నాగేశ్వరరావు, అనిల్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు

మోతీనగర్‌: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు మల్కా కొమరయ్య, సి. అంజిరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. గురువారం మోతీనగర్‌, కబీర్‌ నగర్‌ చౌరస్తాలో బీజేపీ నాయకులు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ కొడిచెర్ల మహేందర్‌ మాట్లాడుతూ.. ఈ ఎన్నికలతో కాంగ్రెస్‌ పార్టీకి కనువిప్పు కలగాలన్నారు. రానున్న కాలంలో తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్‌ అధ్యక్షుడు ఎర్ర స్వామి, సీనియర్‌ నాయకులు మల్లేష్‌ గౌడ్‌, రాష్ట్ర లీగల్‌ సెల్‌ సభ్యులు సద్గుణారెడ్డి, పిట్ల మనోహర్‌, ఐలయ్య, నాగరాజు, భాస్కర్‌, రమేష్‌ నాయర్‌, శోభా రాజన్‌, శ్రీలత, మూసాపేట డివిజన్‌ జనరల్‌ సెక్రటరీ శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.



కాలనీ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న పీఏసీ చైర్మన్‌ గాంధీ

పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: ప్రతి ఒక్కరూ కాలనీ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహననగర్‌ కాలనీ కో ఆపరేటివ్‌ హౌస్‌ బిల్డింగ్‌ సొసైటీ లిమిటెడ్‌ అసోసియేషన్‌ కార్యాలయాన్ని కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్‌గౌడ్‌, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కాలనీ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో రామకోటేశ్వరరావు, బాబురావు, యాదిరెడ్డి, రాజు, హన్మంత రాజు, ప్రసాద్‌, పోతుల రాజేందర్‌, దేవేందర్‌రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం


పూజలో పాల్గొన్న ఆలయ చైర్మన్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, వివేకానందనగర్‌ డివిజన్‌ పరిధిలోని అయ్యప్ప స్వామి దేవస్థాన ప్రాంగణంలో కాశీ విశ్వనాథ సహిత అన్నపూర్ణేశ్వరి ఆలయ నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఆలయ చైర్మన్‌ వడ్డేపల్లి రాజేశ్వరరావు, యామిని దంపతులు పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అయినేని సుదర్శన్‌రావు, నాయినేని సూర్యారావు, కుర్మయ్యగారి సుదర్శన్‌, వడ్డేపల్లి భూపతిరావు, వడ్డేపల్లి మురళీధర్‌రావు, గొట్టిముక్కల భాస్కర్‌రావు, భగవాన్‌, కిషోర్‌, కాలనీవాసులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్థిరమైన అభివృద్ధిని సాధించాలి


సదస్సు సావనీర్‌ను విడుదల చేస్తున్న వీసీ ప్రొ. సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌, అతిథులు

రాయదుర్గం: స్థిరమైన అభివృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందని ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ పబ్లిక్‌ ఎంటర్‌ప్రైజెస్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఎస్‌ శ్రీనివాసమూర్తి అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని మేనేజ్‌మెంట్‌ అండ్‌ కామర్స్‌ విభాగం ఆధ్వర్యంలో 'వికసిత్‌ భారత్‌, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సందర్భంగా సమకాలీన వ్యాపార పద్ధతులు' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార రంగంలో కార్పొరేట్‌ పాత్రను ఆయన ఎత్తిచూపారు. సెంట్రల్‌ సివిల్‌ సర్వెంట్‌, ఎంఎస్‌ఎంఈ మాజీ డైరెక్టర్‌ డాక్టర్‌ మహ్మద్‌ అబ్దుల్‌ ఖుద్దూస్‌ మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థ ఎంతో పటిష్టమైనదన్నారు. ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా పటిష్టమైన చర్యలు చేపట్టడంతో ఆర్థిక వ్యవస్థ ఎదుగుతూనే రాబోయే రోజుల్లో ప్రపంచ స్థాయిలో తనదైన గుర్తింపు సాధించడం ఖాయమన్నారు. అనంతరం సదస్సు సావనీర్‌ను వీసీ ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌ విడుదల చేశారు. రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఇష్తియాక్‌, మనూ స్కూల్‌ ఆఫ్‌ కామర్స్‌ అండ్‌ బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌ డీన్‌ ప్రొఫెసర్‌ బదియుద్దీన్‌ అహ్మద్‌, విభాగాధిపతి ప్రొఫెసర్‌ మహ్మద్‌ అబ్దుల్‌ అజీమ్‌, సదస్సు కన్వీనర్‌ డాక్టర్‌ సయ్యద్‌ ఖాజా సఫీయుద్దీన్‌, అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు డాక్టర్‌ నిస్సార్‌ హుస్సేన్‌, డాక్టర్‌ ఎం.డీ. రషీద్‌ ఫారూఖీ ప్రసంగించారు.



'హైటెక్‌' స్టేషన్‌.. 'అమృత్‌' హంగులు!

రూ.24 కోట్ల అంచనాతో పనులు	పూర్తైన ఎంట్రీ ర్యాంపులు, ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జిల నిర్మాణం	హైటెక్‌ సిటీ రైల్వేస్టేషన్‌లో ఆధునిక సౌకర్యాల కల్పన

కేపీహెచ్‌బీకాలనీ: అమృత్‌ స్టేషన్‌ పథకంతో హైటెక్‌ సిటీ రైల్వే స్టేషన్‌ రూపురేఖలు మారనున్నాయి. ప్రధానంగా సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగుల రాకపోకలకు కేంద్ర బిందువుగా ఉంది. గత ఏడాది ఈ స్టేషన్‌ను అమృత్‌ స్టేషన్‌ పథకం కింద ఎంపిక చేసి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఈ స్టేషన్‌ నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు తమ గమ్య స్థానాలకు చేరుకుంటారు. ఎక్కువ శాతం నగర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో స్థిరపడి హైటెక్‌ సిటీలోని సాఫ్ట్‌వేర్‌ కంపెనీల్లో కొలువులు చేసే వారే అధికం. హైటెక్‌ సిటీ రహదారిలో నిత్యం ట్రాఫిక్‌ సమస్యతో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు వ్యక్తిగత వాహనాల కంటే పబ్లిక్‌ ట్రాన్స్‌పోర్ట్‌కు ఎక్కువగా ప్రాధాన్యతనిస్తుంటారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లోని ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో, ఎంఎంటీఎస్‌ రైళ్లు కీలకంగా నిలుస్తున్నాయి. సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులతో పాటు దూర ప్రాంతాలకు వెళ్లే ఇక్కడి ప్రయాణికులు ఎక్కువగా సికింద్రాబాద్‌, హైదరాబాద్‌, కాచిగూడ, లింగంపల్లి రైల్వే స్టేషన్లకు చేరుకుని, అక్కడి నుంచి దూర ప్రాంత రైళ్ల సర్వీసులను ఉపయోగించుకుంటుంటారు. అలాగే బోరబండ, ఫతేనగర్‌, నేచర్‌ క్యూర్‌ వంటి ప్రాంతాలకు చెందిన కార్మికులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతిరోజూ ఈ స్టేషన్‌ నుంచి వివిధ ప్రాంతాలకు 3,000 నుంచి 5,000 మంది వరకు రాకపోకలు సాగిస్తుంటారు. అప్‌ అండ్‌ డౌన్‌లో మొత్తం 62 రైళ్లు ఈ స్టేషన్‌ మీదుగా వెళ్తుంటాయి. ఈ నేపథ్యంలో హైటెక్‌ సిటీ రైల్వేస్టేషన్‌ను అమృత్‌ స్టేషన్‌ పథకంలో భాగంగా అభివృద్ధి చేస్తున్నారు. కళ్లు జిగేల్‌మనిపించే రీతిలో ఈ స్టేషన్‌ను తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా హైటెక్‌సిటీ వైపు సుందర నిర్మాణాలతో ప్రయాణికుల మదిని దోచేవిధంగా అభివృద్ధి చేస్తున్నారు. అలాగే ప్రవేశద్వారాలను అందంగా ముస్తాబు చేసే పనులు జరుగుతున్నాయి.

72 శాతం పనులు పూర్తి

హైటెక్‌ సిటీ రైల్వేస్టేషన్‌లో అమృత్‌ స్టేషన్‌ పథకం కింద రూ.24 కోట్ల అంచనా వ్యయంతో పనులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 72 శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. అందులో ఎంట్రీ ర్యాంపులు, ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిల నిర్మాణం పూర్తైంది. అలాగే స్టేషన్‌ భవనం, 12 మీటర్ల ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జి, సర్క్యులేటింగ్‌ ఏరియా, అప్రోచ్‌ రోడ్డు, లిఫ్ట్‌ అండ్‌ ఎస్కలేటర్‌, ప్లాట్‌ఫారాలపై కవర్‌ వంటి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది కల్లా పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేలా పనుల్లో వేగంపెంచారు. అలాగే రైలు ప్రయాణికులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందించేందుకు స్థానిక కళలు, సంస్కృతికి ప్రాధాన్యతనివ్వనున్నారు. ప్రణాళికాబద్ధంగా పార్కింగ్‌ ప్రదేశాలు, ప్రకాశవంతమైన లైటింగ్‌తో పాటు స్టేషన్లకు సాఫీగా వెళ్లేలా చూడడం అమృత్‌ స్టేషన్ల అభివృద్ధిలో భాగం. స్టేషన్‌ ముఖద్వారాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. సరైన సూచిక బోర్డులు, పాదచారులు నడిచేందుకు ప్రత్యేక దారి వేస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచన మేరకు ఒక స్టేషన్‌–ఒక ఉత్పత్తి' అంశాన్ని పరిగణనలోనికి తీసుకుని స్టాళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. నాణ్యత గల సమాచార ప్రకటనా వ్యవస్థ, ఎల్‌ఈడీ స్టేషన్‌ సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. పనులన్నీ పూర్తయితే హైటెక్‌ సిటీ రైల్వేస్టేషన్‌ సుందర స్టేషన్లలో ఒకటిగా నిలిచిపోనుంది.


హైటెక్‌ సిటీ రోడ్డు వైపు నూతనంగా ఏర్పాటవుతున్న రైల్వేస్టేషన్‌ ముఖద్వారం

సీతారాముల కల్యాణం.. గోటి తలంబ్రాల్లో భాగస్వాములవండి

ఆల్విన్‌కాలనీ: భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణార్థం పంపే గోటి తలంబ్రాల కార్యక్రమంలో భక్తులు భాగస్వాములవ్వాలని కూకట్‌పల్లి ధర్మజాగరణ సమితి పిలుపునిచ్చింది. గోటి తలంబ్రాల కార్యక్రమంలో భక్తులకు అవకాశం కల్పించారు. ఈ దైవ కార్యక్రమంలో పాల్గొనేందుకు భక్తులు ఇంటి నుంచి ఒక ప్లేట్‌ తీసుకుని సుమిత్రనగర్‌లోని శ్రీకనకదుర్గమ్మ ఆలయానికి 7వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటలకు రావాలన్నారు. వారికి వడ్ల గింజలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులందరూ వినియోగించుకోవాలని సమితి నిర్వాహకులు నామాల శ్రీనివాస్‌ నేత, భోములే శంకర్‌లు కోరారు.

కిటికీ తొలగించి ఇంట్లో చోరీ

జీడిమెట్ల: ఇంటి కిటికీ తొలగించి రూ.15 వేల నగదు, 19 తులాల బంగారు నగలు, 500 గ్రాముల వెండి వస్తువులను దొంగలు అపహరించారు. ఈ ఘటన జీడిమెట్ల పీఎస్‌ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ కనకయ్య వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌ డివిజన్‌ అపురూప కాలనీకి చెందిన పింటు హుదేత్‌ బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి శుభకార్యం నిమిత్తం కలకత్తాకు వెళ్లాడు. గురువారం ఉదయం శేరిలింగంపల్లిలో ఉండే తన భావ రతన్‌చంద్రా మండల్‌కు ఫోన్‌ చేసి అపురూప కాలనీలోని ఇంటికి వెళ్లి చూడాల్సిందిగా కోరాడు. అతను వెంటనే ఇంటికి వెళ్లి చూడగా.. కిటికీ తొలగించి ఉంది. తలుపులు తెరచి లోపలికి వెళ్లగా బీరువా తెరచి ఉంది. బీరువాలో ఉన్న రూ.15 వేల నగదు, 19 తులాల నగలు, 500 గ్రాముల వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో బాధితుడి బావ గురువారం జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడినట్లు పోలీసులు గుర్తించారు.

భవన నిర్మాణ అనుమతి పత్రాల ఫోర్జరీ!

పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ: భవన నిర్మాణ అనుమతి పత్రాలను ఫోర్జరీ చేసిన ఓ భవన నిర్మాణ సంస్థపై జీహెచ్‌ఎంసీ అధికారులు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. కేపీహెచ్‌బీకాలనీ డివిజన్‌ పరిధిలోని మిడో ల్యాండ్‌ అపార్ట్‌మెంట్స్‌ వెనుక వైపు సుమారు 1700 గజాల స్థలంలో వైవీ ఆర్‌ కన్‌స్ట్రక్షన్స్‌ సంస్థ యజమాని బిల్డర్‌ వై.వెంకటేశ్వరరావు (వైవీరావు) ప్రభాకర్‌రెడ్డి అనే మరో వ్యక్తితో కలిసి ఐదంతస్తుల భవన నిర్మాణం చేపట్టారు. ఇదే భవన నిర్మాణ విషయంలో ఓ వ్యక్తి కోర్టులో కేసు వేసి జీహెచ్‌ఎంసీ అధికారులను కూడా ప్రతివాదులుగా చేర్చారు. దీంతో అధికారులు సదరు భవనం అనుమతి విషయాన్ని పరిశీలించగా.. ఫేక్‌ అని నిర్ధారణ అయ్యినట్లు తెలిసింది. భవన నిర్మాణానికి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఫోర్జరీ అనుమతి పత్రాలను చూపి నిర్మాణం చేపట్టినట్లు అధికారులకు కూడా ఫిర్యాదు అందింది. దీంతో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ మూసాపేట సర్కిల్‌ ఉప కమిషనర్‌ కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బిల్డర్‌ వైవీ రావును స్టేషన్‌కు పిలిచి విచారణ చేపట్టారు. అయితే తాను మాత్రం ఎలాంటి ఫోర్జరీకి పాల్పడలేదని, జీహెచ్‌ఎంసీకి చెల్లించిన డీడీ పత్రాలతో పాటు ఒరిజినల్‌ అనుమతి పత్రాలను పోలీసులకు ఇచ్చినట్లు తెలిసింది. అయితే సదరు అనుమతి పత్రాలు నకిలీవా? ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసినవా? అనే విషయాన్ని తేల్చేపనిలో పోలీసులు ఉన్నారు.

నాణ్యతతో ల్యాబ్‌ సేవలందించాలి


ల్యాబ్‌లో పరికరాలను పరిశీలిస్తున్న వీసీ

కేపీహెచ్‌బీకాలనీ: విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన ల్యాబ్‌ సేవలను అందించాలని జేఎన్‌టీయూహెచ్‌ వీసీ, ప్రొఫెసర్‌ టి. కిషన్‌కుమార్‌ రెడ్డి అన్నారు. గురువారం యూనివర్సిటీ ఇంజినీరింగ్‌ కళాశాలలో మెకానికల్‌, సివిల్‌, ఎలక్ట్రికల్‌ ఇంజినీరింగ్‌ విభాగాలను పరిశీలించారు. ల్యాబ్‌లలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న పరికరాలను వాటి పనితీరును పరిశీలించారు. ఏఐసీటీఈ ప్రమాణాలకు అనుగుణంగా ఫ్యాకల్టీ సేవలను, నాణ్యతతో కూడిన మెరుగైన సౌకర్యాలను కల్పించడం యూనివర్సిటీ అధికారుల బాధ్యతగా భావించాలని సూచించారు. వీసీతో పాటు రెక్టార్‌ విజయ్‌కుమార్‌ రెడ్డి, రిజిస్ట్రార్‌ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్‌ జీ.వి. నరసింహారెడ్డి, చీఫ్‌ ఇంజినీర్‌ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడిగా కర్క నాగరాజు


నియామక పత్రాన్ని నాగరాజుకు అందజేస్తున్న బండి రమేష్‌ తదితరులు

కూకట్‌పల్లి: ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడిగా మూసాపేటకు చెందిన కర్క నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ గురువారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్‌ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్మికులకు కాంగ్రెస్‌ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. అనంతరం కర్క నాగరాజు మాట్లాడుతూ..ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్మికులకు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ చైర్మన్‌ లక్ష్మయ్య, సీనియర్‌ నాయకులు కర్క పెంటయ్య, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ పుష్పారెడ్డి, వైస్‌ చైర్మన్‌ ప్రకాష్‌, మాదిరెడ్డి యుగంధర్‌ రెడ్డి, సుధాకర్‌ రెడ్డి, అరుణ్‌కుమార్‌, అజాజ్‌, బాలరాజు, హమీద్‌, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

బంగారు, వెండి ఆభరణాలు చోరీ

ఇంటి వ్యక్తిని తోసేసి మహిళ పరార్‌

జగద్గిరిగుట్ట : ఓ మహిళ ఓ ఇంట్లో చొరబడి బంగారు, వెండి ఆభరణాలతో పరారైంది. ఈ ఘటన బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. జటకన్య హోటల్‌, ఆల్విన్‌ కాలనీలో నివాసం ఉండే శ్రీకాంత్‌ ప్రైవేట్‌ కంపెనీలో పని చేస్తున్నాడు. రోజులాగే విధులకు వెళ్లాడు. అతని తల్లిదండ్రులు ఇంట్లో ఉన్నారు. శ్రీకాంత్‌ తండ్రి పక్కనున్న ఇంటి వాళ్లతో మాట్లాడుతుండగా ఇంట్లో నుంచి శబ్దం వినిపించింది. ఓ మహిళ బయటకు రావడం చూశాడు. ఎవరూ అని ప్రశ్నించే లోపే అతడిని తోసేసి పరారైంది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా.. బీరువాలో ఉన్న 6 తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చోరీ కంటే ముందు ఆ మహిళ సమీపంలోని ఓ ఫొటో స్టూడియోలో కెమెరాను కూడా చోరీ చేసేందుకు యత్నించినట్లు తెలిసింది. ఇదే స్టూడియోలో ఫొటో దిగి తనకు ఇష్టం లేదని ఫొటోను డిలీట్‌ చేపించింది. ఆ మహిళకు మరొకరు సహకారం కూడా చేసినట్లు సీసీ కెమెరా ఫుటేజీలో కనిపించింది.

వీధి కుక్క దాడిలో బాలుడికి గాయాలు

ఆల్విన్‌కాలనీ: వీధి కుక్క దాడిలో బాలుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన కూకట్‌పల్లి సర్కిల్‌ పరిధిలోని హైదర్‌నగర్‌ డివిజన్‌, జలవాయు విహార్‌లో గురువారం మధ్యాహ్నం జరిగింది. బాలుడిని వీధి కుక్క వెంబడించి కరిచింది. బాలుడు అరుపులు వేయటంతో స్థానికులు కుక్కను తరిమి కొట్టారు. తల్లిదండ్రులకు బాలుడిని అప్పగించారు. అనంతరం ఆసుపత్రికి తీసుకెళ్లారు. కుక్కలు కాలనీలో గుంపులు గుంపులుగా తిరుగుతూ వెంబడించి కరుస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. స్థానికంగా ఉన్న చెరువు వద్ద, శ్మశాన వాటిక వద్ద, మాంసం దుకాణాల వద్ద, హోటల్స్‌ వద్ద వ్యర్థాలతో పాటు చెత్తా చెదారాన్ని అక్కడ పడేయడంతో కుక్కలకు ఆవాసంగా మారుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

3.1 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరి అరెస్ట్‌

చందానగర్‌ : శేరిలింగంపల్లి ఎక్సైజ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో 3.1 కిలోల గంజాయి, 7.5 గ్రాముల హెరాయిన్‌ను సీజ్‌ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గురువారం ఉదయం చందానగర్‌, శేరిలింగంపల్లిలో గంజాయి, హెరాయిన్‌ నిల్వ చేసినట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో రంగారెడ్డి డిప్యూటి కమిషనర్‌ దశరథ, ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ కృష్ణ ప్రియ, అసిస్టెంట్‌ సూపరింటెండెంట్‌ శ్రీనివాస్‌రెడ్డిల ఆదేశాల మేరకు శంషాబాద్‌ డీటీఎఫ్‌ బృందం గంజాయి నిల్వ ఉంచిన ప్రాంతంపై దాడులు చేశారు. బిహార్‌కు చెందిన నరేష్‌ సహ్ని (33) గంజాయిని, పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుబోల్‌ బిశ్వాస్‌ (33) హెరాయిన్‌ కలిగి ఉండడాన్ని గమనించి వెంటనే వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. 3.1 కిలోల గంజాయి, 7.5 గ్రాముల హెరాయిన్‌, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ దాడిలో సీఐ ప్రవీణ్‌కుమార్‌, ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, ఫక్రుద్దీన్‌, మల్లేష్‌, గణేష్‌, నెహ్రూ, శేఖర్‌ పాల్గొన్నారు.


గంజాయితో పట్టుబడ్డ నిందితులతో శంషాబాద్‌ డీటీఎఫ్‌ ఎక్సైజ్‌ పోలీసులు

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీకాలనీ: వసంతనగర్‌ సెక్షన్‌ పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్‌, సర్దార్‌ పటేల్‌ నగర్‌, భగత్‌సింగ్‌ నగర్‌ ఫేజ్‌ 2 పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఈ నెల 10న భవిష్యనిధి అదాలత్‌


మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్‌ ఫండ్‌ (పీఎఫ్‌) కార్యాలయం ఆధ్వర్యంలో భవిష్యనిధి అదాలత్‌ నిర్వహించనున్నట్లు పీఎఫ్‌ కమిషనర్‌ వివి డొంగ్లికర్‌ గురువారం తెలిపారు. ఈ నెల 10న కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని బస్‌ టెర్మినల్‌లోని రెండవ అంతస్తులో ఉన్న పీఎఫ్‌ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాకుండా వారి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని అన్నారు. కూకట్‌పల్లి, జీడిమెట్ల, సనత్‌నగర్‌, బీహెచ్‌ఈఎల్‌ ప్రాంతాల ఖాతాదారులు పాల్గొనాలని కోరారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి వేడుకలు


పూజలో పాల్గొన్న పీఏసీ చైర్మన్‌ అరెకపూడి గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ కాలనీలో వేంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలోని కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి 5వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయినేని చంద్రకాంత్‌, ప్రసాద్‌, నాని, నాగేశ్వరరావు, కృష్ణంరాజు, కుమార్‌ పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు


బహుమతి అందజేస్తున్న డీసీ వంశీకృష్ణ

కూకట్‌పల్లి: మూసాపేట డివిజన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మహిళా సమాఖ్య సంఘాల సభ్యులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మూసాపేట సర్కిల్‌ ఉప కమిషనర్‌ వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు వివిధ రంగాల్లో అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్‌ ఇంద్రసేన, కమ్యూనిటీ ఆర్గనైజర్‌ మురళి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.